సాక్షి రంగారెడ్డి
ఆదివారం । 19 । నవంబర్ । 2023



వ్యాపారంగా పాలిటిక్స్

ప్రస్తుత రాజకీయాలు వ్యాపారమయంగా మారాయని ఏఐసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. 10లో▸



పటిష్ట చర్యలు

వచ్చే 12 రోజులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. 10లో▸

ఈవీఎంలపై అవగాహన అవసరం

పరిగి: ఈవీఎం మిషన్లపై అవగాహన పెంచుకోవాలని జనల్ అబ్జర్వర్ సుధాకర్ జైస్వాల్ అన్నారు. శనివారం ఆర్ఓ కార్యాలయంలో వివిధ పార్టీ అభ్యర్థులు, ఏజెంట్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. పోటీ చేసే అభ్యర్థి, ఏజెంట్లు తప్పక అవగాహన పెంచుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ ఉత్పల్ కుమార్ నస్కర్ తదితరులు

పహాడీషరీఫ్: సాధారణ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండడంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం పోలీస్ అధికారులు అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే రౌడీషీటర్లను బైండోవర్ చేసిన వారు తాజాగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమెరికన్ టాలెంట్ స్కూల్‌ను శనివారం పోలీస్ అబ్జర్వర్ ఉత్పల్ కుమార్ నస్కర్, మహేశ్వరం ఏసీపీ బి.శ్రీనివాస్ యాదవ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డి పరిశీలించారు.

రూ.10.50 లక్షలు సీజ్



పట్టుబడిన నగదుతో సీఐ, సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట ఔటర్ కూడలిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద శనివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.10.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్‌చేసి, ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

డీసీపీ నారాయణరెడ్డి




కవాతు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

కడ్తాల్: ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శనివారం రాత్రి మండల కేంద్రంతో పాటు, మైసిగండి గ్రామాల్లో పారా మిలటరీ, సీఐఎస్ఎఫ్, స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా మద్యం, డబ్బు పంపిణీ చేస్తే నేరుగా తమకు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాంకుమార్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐలు వెంకటేశ్వర్లు, శివ ప్రసాద్, ఎస్ఐలు హరిశంకర్‌గౌడ్, బలరాం, శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి

- మహేశ్‌రెడ్డిని మరోసారి గెలిపించాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



కుల్కచర్ల మండలంలో ప్రచారం చేస్తున్న సునీతారెడ్డి

కుల్కచర్ల: సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న మహేశ్‌రెడ్డిని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి కోరారు. శనివారం కుల్కచర్ల, చాపలగూడెం, తిర్మలాపూర్, బిందెంగడ్డ తండా, చెరువు ముందలి తండా, ఇప్పాయిపల్లి, రాంపూర్, అనంతసాగర్, గోరిగడ్డ తండా, పుట్టపహాడ్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని కోరే బీఆర్ఎస్ పార్టీకి మద్దతివ్వాలని కోరారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

మరోసారి తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపితే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ పరిగి అభ్యర్థి, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, చౌడాపూర్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పథం..

బంధు'ఘనం'

మిగిలింది పది రోజులే..

- సర్వశక్తులూ ఒడ్డుతున్న అభ్యర్థులు
- రంగంలోకి దిగిన బంధువులు
- గెలుపే లక్ష్యంగా తమవారి కోసం ఆరాటం
- ఇంటింటికీ తిరిగి విస్తృత ప్రచారం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పోలింగ్‌కు సమయం దగ్గరపడుతోంది. మరో పది రోజుల్లో ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఈలోపే నియోజకవర్గం మొత్తం చుట్టేయడం.. ప్రతి ఒక్క ఓటరును కలవడం అనేది పోటీలో ఉన్న అభ్యర్థికి కత్తిమీదసామే. అందుకే ఆ బాధ్యతను వారి బంధుగణం భుజానికెత్తుకుంది. పతుల కోసం సతులు ఇంటి గడపదాటి బయటికి వచ్చారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ఓటర్ల ముఖం కూడా చూడని వారి పిల్లలు, బంధువులు తమ వాళ్ల గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. వార్డులు, గ్రామాలు, డివిజన్లు, పోలింగ్ బూతుల వారీగా ఓటర్లను గుర్తించే ముఖ్య నాయకులను వెంటేసుకుని, ఇంటింటికీ తిరుగుతూ తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

మహేశ్వరం

బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి సబితారెడ్డి తరపున ఆమె పెద్ద కుమారుడు కార్తీక్‌రెడ్డి జల్‌పల్లి కేంద్రంగా, రెండో కుమారుడు కౌశిక్‌రెడ్డి మీర్‌పేట్‌లో, చిన్న కుమారుడు కళ్యాణ్‌రెడ్డి ఆర్కేపురం, సరూర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తరపున ఆయన సతీమణి విజయలక్ష్మి మీర్‌పేట్ మున్సిపాలిటీ కేంద్రంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయన కుమారుడు అనురూప్‌రెడ్డి సైతం ప్రచారం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ తరపున ఆయన సతీమణి ఆండాలు, కుమార్తె సోని విస్తృత ప్రచారం చేస్తున్నారు.

ఇబ్రహీంపట్నం

బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తరపున ఆయన కుమారుడు ప్రశాంత్‌రెడ్డి, కుమార్తె సీతల్, కోడలు మౌనిక ప్రచారం సాగిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి తరపున ఆయన సతీమణి అనసూయ, బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్ తరపున ఆయన సతీమణి జయలక్ష్మి ప్రచారం చేస్తున్నారు.

కల్వకుర్తి

కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి సతీమణి మాధవిరెడ్డి ఆమనగల్లు మండలంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్నారు. బీజేపీ అభ్యర్థి తరపున ఆచారి సతీమణి గీత.. బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్ తరపున ఆయన కుమార్తెలు సంగీత, వాణి, జ్యోతి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

షాద్‌నగర్

బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్ గెలుపు కోసం ఆయన కుమారులు రవీందర్ యాదవ్, మురళీ యాదవ్ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ సతీమణి అనురాధ షాద్‌నగర్ పట్టణంలో ఇంటింటికీ తిరిగి భర్త గెలుపు కోసం కృషి చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి అందె బాబయ్య సతీమణి కిష్టమ్మ సహా కోడళ్లు సరిత, మాధురి, దివ్య ప్రచారం చేస్తున్నారు.

రాజేంద్రనగర్

బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాసరెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి సహా వదిన ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఎల్బీనగర్

బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి కమల ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

చేవెళ్ల

బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య గెలుపు కోసం ఆయన సతీమణి జయమ్మ, కోడలు భవాని ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి భీం భరత్ సతీమణి జ్యోతి.. బీజేపీ అభ్యర్థి కేఎస్‌రత్నం గెలుపు కోసం ఆయన సతీమణి ప్రమీల, కుమార్తె ప్రణీత, కొడుకు ప్రమోద్ ప్రచారం చేస్తున్నారు.

శేరిలింగంపల్లి

బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్ తరపున ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ ప్రచారం చేస్తున్నారు. తన అనుచరుల నివాసాలకు చేరుకుకుని కుమారుడికి సహకరించాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి అరికెపూడి గాంధీ కోసం సతీమణి శ్యామలాదేవి, కుమారుడు పృథ్వీ, కుమార్తె ప్రణీత ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ సతీమణి పూజిత, కుమార్తె హరిత ప్రచారం సాగిస్తున్నారు.



మహేశ్వరం: గొల్లూరు గ్రామంలో ప్రచారం చేస్తున్న కేఎల్లార్ సతీమణి విజయారెడ్డి



మంచాల: తాళ్లపల్లి గూడలో ప్రచారంలో పాల్గొన్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోడలు మౌనిక



ఆమనగల్లు: మేడిగడ్డలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి సతీమణి మాధవిరెడ్డి

బీఆర్ఎస్‌తోనే మైనార్టీలకు రక్షణ

- డిప్యూటీ సీఎం మహమూద్ అలీ



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మహమూద్అలీ

షాద్‌నగర్ రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మైనార్టీలకు పూర్తి రక్షణ కల్పించారని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని రెడ్‌రోజ్ గార్డెన్‌లో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మైనార్టీలకు విద్య లేకపోవడంతోనే వెనుకబాటుకు గురయ్యారని అన్నారు. మైనార్టీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. 60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ మైనార్టీల కోసం చేసిందేమీ లేదని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో సీలింగ్ యాక్టును తీసుకువచ్చి పేదల భూములు గుంజుకుందని, నవాబుల భవనాలను స్వాధీనం చేసుకుందని విమర్శించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి అంజయ్యయాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసీవుల్లాఖాన్, ఎస్‌డీ ఇబ్రహీం, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, నాయకులు అబ్దుల్ రబజ్‌జామి, సయ్యద్‌సాధిక్, అద్దు, సర్వర్‌పాష, శోయబ్, ఆశం తదితరులు పాల్గొన్నారు.

గంపగుత్తగా గాలం!

- ఓట్ల కోసం పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలు
- పోలింగ్ సమీపిస్తుండటంతో కొత్త ఎత్తుగడలు
- అప్రమత్తమంగా బూత్ కమిటీలు
- ఉద్యోగ, కార్మిక, కాలనీ, యూనియన్లపై దృష్టి
- వలస కార్మికులు, ఉద్యోగుల ఓట్లపై ప్రత్యేక గురి
- గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో 9,752 పోలింగ్ కేంద్రాలు
- మొత్తం ఓటర్లు 1.08 కోట్ల మంది
- వలస ప్రజలు 5 లక్షల మందికి పైగా ఉంటారని అంచనా

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల పోలింగుకు సమయం సమీపిస్తోంది. మరో 11 రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈలోగా ఓటర్లను మరింత ఆకర్షించేందుకు పార్టీలు రకరకాల వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇప్పటికే అభ్యర్థులు తమదైన శైలిలో అనుయాయులను రంగంలోకి దింపారు. ఎలాగోలా ఓటర్లను బుట్టలో వేసుకునే పని మొదలు పెట్టారు. ఒకవైపు పార్టీ బూత్ కమిటీ సభ్యులను అప్రమత్తం చేస్తూనే.. మరోవైపు గంపగుత్త ఓట్ల వేటలో పడ్డారు. కుల, మత, ఉద్యోగ, కాలనీ, కార్మిక, కర్షక, అపార్టుమెంట్లు.. ఇలా రకరకాల కమిటీలు, సంఘాలపై దృష్టి సారించారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఓట్ల శాతం పెంపుపై అంచనా వేసుకుంటున్నారు.

బూత్ కమిటీల పటిష్టతతో..

బస్తీలు, వార్డులు, డివిజన్లలో ప్రచారంలో దూసుకుపోతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు తాజాగా పోలింగ్ బూత్ కమిటీలపై దృష్టి సారించారు. ఏయే పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎవరెవరు పని చేస్తున్నారు. వారికి ఎలాంటి వనరులు సమకూర్చాలనే పలు అంశాలపై లోతైన పరిశీలనకు శ్రీకారం చుట్టారు. ఒక్కో నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ బూత్‌లు ఉండగా, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, పార్టీలు బూత్ కమిటీల నియామకం పూర్తి చేశాయి. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో వంద ఓట్లకు ఒక కమిటీ ఏర్పాటు చేశారు. 10 నుంచి 15 మంది తగ్గకుండా పార్టీల నాయకులు, కార్యకర్తలను కమిటీల సభ్యులుగా చేర్చారు. వీరు ప్రతిరోజు బూత్ పరిధిలోని ఓటర్లను గుర్తించాలి. పోలింగ్ రోజు ఓటర్లను తీసుకొచ్చే బాధ్యత వీరికే అప్పగించేందుకు కసరత్తు చేస్తున్నారు. గ్రేటర్‌తోసహా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 9,752 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,08,78,339 మంది ఓటర్లున్నారు. వీరిలో అధిక శాతం ఓట్లు తమ పార్టీకే వేసేలా పార్టీలు నిమగ్నమయ్యాయి. ఇందులో వలస ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు 5 లక్షల మందికిపైగా ఉండవచ్చని అంచనా.

ఎత్తుగడల్లోనూ వ్యూహాలు..

- ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజుకు నేటికి నేతలు రాజకీయ ఎత్తుగడలను మారుస్తున్నారు. తాజాగా కుల,మత సంఘాలు, రకరకాల యూనియన్ల వైపు దృష్టి సారిస్తున్నారు. కులాల వారీగా ఉన్న సంఘాలు కొన్ని ప్రాంతాల్లో లక్ష్యసాధన కోసం చురుగ్గా పని చేస్తున్నాయి. వాటి ప్రభావం ఆయా ప్రాంతాల్లో బలంగా పని చేస్తుందని కొందరు అభ్యర్థులు విశ్వసిస్తున్నారు.
- గ్రేటర్ సహా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని చిన్న తరహా, భారీ పరిశ్రమల్లో లక్షలాది కార్మికులు, ఉద్యోగులు పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వీరి ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయనుండటంతో.. ప్రభుత్వ, ప్రైవేటు, ఉద్యోగ సంఘాలతో ప్రధాన పార్టీల నేతలతో పాటు అభ్యర్థులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి గంపగుత్తగా ఓట్లను రాబట్టే యత్నాలకు శ్రీకారం చుట్టారు.

ఓటర్లను ప్రభావితం చేసే వారికి ఫోన్లు

అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి క్షేత్ర స్థాయిలో బూత్ కమిటీలపైనే అభ్యర్థులు ఎక్కువ భారం మోపుతున్నారు. ఇంటింటికీ వెళ్తున్న కమిటీ సభ్యుల నుంచి రోజువారీ నివేదికలను ప్రధాన పార్టీలు తెప్పించుకుంటున్నాయి. ఏ రోజుకారోజు ఓటర్ల మనోగతం, ఆయా ప్రాంతాలు, బస్తీలు, పట్టణాల స్థానిక పరిస్థితులను సమీక్షిస్తున్నారు. అవసరమైతే కలిసిన ఓటర్ల ఫోన్ నంబర్లనూ సేకరిస్తున్నారు. వీలైతే అభ్యర్థితోనూ మాట్లాడిస్తున్నారు. కొందరు అభ్యర్థులు మెజార్టీ లక్ష్యంగా ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులతో ఫోన్లల్లో మాట్లాడిస్తూ.. ఎన్నికల ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

గ్రేటర్, శివారు జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు

జిల్లా పేరు	పోలింగ్ కేంద్రాలు	ఓటర్ల సంఖ్య
హైదరాబాద్	3,986	45,36,852
రంగారెడ్డి	3,369	35,22,420
మేడ్చల్–మల్కాజిగిరి	2,397	28,19,067
మొత్తం	9,752	1,08,78,339





యువతి చేతులకు తీవ్ర గాయాలు

'ప్రేమ'పై అనుమానం

- ప్రియురాలిపై కత్తితో దాడి
- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న యువతి
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

షాద్‌నగర్ రూరల్: ప్రేమించిన యువతిపై అనుమానం పెంచుకున్న ప్రియుడు కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన షాద్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నయీమొద్దీన్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన యువతి పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో చదువుకుంది. ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి పరిధిలోని పుల్చర్లకుంటతండాకు చెందిన తిరుపతి అదే కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా యువతితో ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఆమెకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో చదువు మానేసి పట్టణంలోని ఓ దుకాణంలో పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటోంది. కొన్నేళ్లుగా యువతి, తిరుపతి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోంది. వీరి ప్రేమబంధంలో ఇటీవల కలతలు మొదలయ్యాయి. యువతిపై అనుమానం పెంచుకున్న ప్రియుడు ఆమెను మానసికంగా వేధింపులకు గురిచేయడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో పదునైన కత్తి తీసుకుని శనివారం ఆమె ఇంటికి వెళ్లాడు. ఇంటిమేడపై యువతి ఒంటరిగా దుస్తులు ఆరేస్తుండగా దాడి చేశాడు. చేతిపై, చేతి మణికట్టు, గొంతుపై పొడిచాడు. భయాందోళనకు గురైన బాధితురాలు కేకలు వేసింది. అది విన్న చుట్టుపక్కల వారు వచ్చే సరికి తిరుపతి అక్కడ నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన యువతిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు పట్టణ సీఐ ప్రతాప్‌లింగం నేతృత్వంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ తెలుసుకుని, అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నయీమొద్దీన్ తెలిపారు.

నోటా.. తూటా



- అభ్యర్థులు నచ్చకపోతే దీనికే ఓటు
- గెలుపోటములను శాసించే ఆయుధం
- ఫలితాలను తారుమారు చేసే అవకాశం

కొత్తూరు: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే అధికారాన్ని కల్పిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్లకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్స్)లో బరిలో ఉన్న అభ్యర్థుల గుర్తుతో పాటు నోటా ఆప్షన్‌ను ఏర్పాటు చేసింది. పోటీలో ఉన్న అభ్యర్థులకు ఓటు వేయడం లేదు అనే ఆప్షన్‌ను ఈవీఎంలలో అభ్యర్థుల గుర్తుతో పాటు నోట అనే బటన్‌ను పొందుపర్చారు. ఆ బటన్ నొక్కితే ఓటు ఏ పార్టీకి పడదు. కానీ ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లే లెక్క.

గెలుపోటములపై ప్రభావం

నోటాకు పడే ఓట్లు తూటా కంటే బలమైనవిగా మారాయా..? అభ్యర్థుల ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయా..? అంటే అవుననే సమాధానం వస్తోంది. గతంలో పలు నియోజకవర్గాల్లో వెల్లడించిన ఫలితాల్లో నోటాకు పడే ఓట్లు గెలుపోటములను శాసించే శక్తిగా మారాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి తల్లోజు ఆచారిపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి కేవలం 78 ఓట్లతో గెలుపొందారు. నోటాకు 1,139 ఓట్లు పోలయ్యాయి. నోటాకు బదులు అభ్యర్థులకు ఈ ఓట్లు పోలై ఉంటే గెలుపోటముల ఫలితం మరోలా ఉండేది.

2018 ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్లు

- షాద్‌నగర్ నియోజకవర్గంలో 1,89,088 ఓట్లు ఉండగా అభ్యర్థులకు 1,66,527 ఓట్లు, నోటాకు 1,909 ఓట్లు పోలయ్యాయి. 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా ఆరుగురికి నోటా కంటే తక్కువ ఓట్లు పోలయ్యాయి.
- కల్వకుర్తి నియోజకవర్గంలో 2,04,002 ఓట్లు ఉండగా 1,77,914 అభ్యర్థులకు, నోటాకు 1,334 పోలయ్యాయి. నియోజకవర్గం నుంచి 16 మంది పోటీ చేయగా ఏడుగురు అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.
- చేవేళ్ల నియోజకవర్గంలో 2,24,230 ఓట్లకు గాను 1,77,197 ఓట్లు అభ్యర్థులకు, నోటాకు 1,469 పోలయ్యాయి. నియోజకవర్గం నుంచి పది మంది పోటీ చేయగా ఐదుగురు అభ్యర్థులకు నోటా కంటే తక్కువ పోలయ్యాయి.
- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 5,75,583 ఓట్లకు గాను అభ్యర్థులకు 2,79,805 ఓట్లు, నోటాకు 3,637 ఓట్లు పోలయ్యాయి. ఈ నియోజకవర్గం నుండి 30 మంది పోటీ చేయగా 27 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు పోలయ్యాయి.
- రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 4,41,074 ఓట్లు ఉండగా 2,50,934 ఓట్లు అభ్యర్థులకు, నోటాకు 1,729 ఓట్లు పోలయ్యాయి. 27 మంది అభ్యర్థులు పోటీ చేయగా 21 మందికి నోటాకు పోలైన ఓట్ల కంటే తక్కువ వచ్చాయి.
- మహేశ్వరం నియోజకవర్గంలో 4,23,261 ఓట్లకు గాను అభ్యర్థులకు 2,34,250 ఓట్లు, నోటాకు 2,171 పోలయ్యాయి. నియోజకవర్గం నుంచి 18 మంది పోటీ చేయగా 12 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు పోలయ్యాయి.
- ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో 4,93,841 ఓట్లు ఉండగా అభ్యర్థులకు 2,44,841 ఓట్లు, నోటాకు 3,085 పోలయ్యాయి. ఇక్కడ 36 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 30 మందికి నోటాకు పోలైన ఓట్ల కంటే తక్కువ వచ్చాయి.
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 2,57,711 ఓట్లు ఉండగా అభ్యర్థులకు 1,96,851, నోటాకు 1,151 పోలయ్యాయి. 21 మంది అభ్యర్థులు పోటీ చేయగా 14 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు పోలయ్యాయి.
- పరిగిలో మొత్తం 2,29,436 ఓట్లకు గాను 1,75,371 ఓట్లు అభ్యర్థులకు.. నోటాకు 1,381 పడ్డాయి. ఇక్కడ 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా ఆరుగురికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.
- తాండూరు నియోజకవర్గంలో 2,01,917 ఓట్లు ఉండగా అభ్యర్థులకు 1,56,436 ఓట్లు, నోటాకు 787 పోలయ్యాయి. ఈ నియోజకవర్గం నుంచి 13 మంది పోటీ చేయగా ఏడుగురు అభ్యర్థులకు నోటాకు పడిన ఓట్ల కంటే తక్కువ పోలయ్యాయి.
- కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,01,941 ఓట్లకు గాను అభ్యర్థులకు 1,65,559, నోటాకు 1,472 పోలయ్యాయి. 15మంది అభ్యర్థులు పోటీ చేయగా పది మందికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.
- వికారాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,07,222 ఓట్లు ఉండగా 1,53,722 ఓట్లు అభ్యర్థులకు, నోటాకు 1,531 పోలయ్యాయి. 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా లేడుగురికి నోటాకు పోలైన ఓట్ల కంటే తక్కువ వచ్చాయి.

కాంగ్రెస్‌లో చేరిన ఝాన్సీరాణి

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ మాజీ వార్డు సభ్యురాలు ఝాన్సీరాణి తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. నరేందర్ వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

అహంకారంపై విజయం తథ్యం

అత్తాపూర్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు అహంకారం ఆత్మ విశ్వాసానికి మధ్య జరుగుతున్నాయని బీజేపీ జిల్లా నాయకులు సుధాకర్ అన్నారు. ఇవి యుద్ధంలాంటి ఎన్నికలని, దీనిలో బీజేపీ ఆత్మవిశ్వాసం, విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి తరఫున శనివారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయనకు అనుకూలంగా ప్రజలు స్పందిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ గద్దె దిగడం ఖాయమని, అధికార పార్టీ ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి సానుకూల పవనాలు వీస్తున్నాయని, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రాబోతుందన్నారు.

ఓటర్లకు పోల్ చిట్టీలు



ఓటర్‌కు స్లిప్పను అందజేస్తున్న బీఎల్‌ఓ

కేశంపేట: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు బీఎల్‌ఓలు గ్రామాల వారీగా ఓటర్లకు ఓటరు సిప్పులు పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ నవంబర్ 30న మీకు కేటాయించిన పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు సూచిస్తున్నారు.

వ్యాపారంగా పాలిటిక్స్



1994 ఎన్నికల సందర్భంగా ముషీరాబాద్‌లో ముదిరెడ్డి కోదండరెడ్డి ప్రచారం

రాజకీయాలంటే హుందాతనం.. అది ఒకప్పటి మాట.. కాలక్రమేణా రూపు మారింది. తిట్ల దండకంతోనే కొంతమంది నేతలు పాలిటిక్స్‌లో పాపులర్ అవుతున్నారు. రాజకీయం నేడు వ్యాపారమైంది. దీంతో ప్రజల్లోనూ రాజకీయాలపై విశ్వాసం సన్నగిల్లుతోంది. తాజాగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాటి, నేటి రాజకీయాలపై ముదిరెడ్డి కోదండరెడ్డి తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

- నాయకులు ఓటర్ల విశ్వాసం కోల్పోతున్నారు
- ఏఐసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి

యాచారం: ప్రస్తుత రాజకీయాలు వ్యాపార ముసుగు ధరించాయి. వచ్చిన పదవులను అడ్డం పెట్టుకుని ప్రజాప్రతినిధులు దండిగా సంపాదించి వాటిని ఎన్నికల సమయంలో ఉపయోగిస్తూ.. కోట్లు ఖర్చు చేసి ఓటర్ల కొనుగోలుకు యత్నిస్తున్నారు. ప్రజల్లోనూ నాయకులపై విశ్వాసం సన్నగిల్లింది. నాడు ఓటర్లు సేవచేస్తారనే విశ్వాసంతో ప్రచారం చేసి నాయకులను ఎమ్మెల్యేలుగా గెలిపించేవారు. కానీ నేడు ఓటర్లు ఎన్నికలొస్తే నాయకులు ఏం ఇస్తారోనని ఎదురుచూస్తున్నారు, పోటీ చేసే నాయకులు సైతం రూ.కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడడం లేదన్నారు. ప్రస్తుత రాజకీయాలు చూస్తుంటే బాధేస్తుందని సీఎల్‌పీ మాజీ కార్యదర్శి, హుడా మాజీ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నత విద్య నుంచి రాజకీయాలకు..

యాచారం గ్రామానికి చెందిన ముదిరెడ్డి కోదండరెడ్డిపై చదువులకోసం హైదరాబాద్ నగరానికి వెళ్లారు. ఉన్నత విద్యలో ఉండగా ఇందిరాగాంధీ పాలనకు ముగ్ధుడై రాజకీయాలకు ఆకర్షితులయ్యారు. దీంతో ఆయన యువజన కాంగ్రెస్‌లో చేరి నగరంలోని ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి 1989 నుంచి 1999 వరకు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేశారు.

ఓటర్ల డబ్బుతోనే అసెంబ్లీ మెట్లెక్కా

1989, 1994 ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజవర్గంలో జనతా పార్టీ నుంచి పోటీ చేసిన తెలంగాణ మాజీ హోం మంత్రి దివంగత నాయిని నర్సింహారెడ్డిపై కాంగ్రెస్ నుంచి రెండు పర్యాయాలు విజయం సాధించా. ఎన్నికలు వస్తే పార్టీ శ్రేణులే స్వచ్ఛందంగా తెల్లవారే వరకు ప్రచారానికి వచ్చేవారు. ప్రచారంలో ఓటర్లే చందాలు ఇచ్చే వారు. వారిచ్చిన చందాలు రూ.5లక్షల నుంచి రూ.8 లక్షలు ఖర్చు చేసి అసెంబ్లీ మెట్లెక్కా. వారిచ్చిన చందాలతో వాల్‌రైటింగ్స్, బ్యానర్స్, ఓటర్స్ స్లిప్పులకు డబ్బు ఖర్చయ్యేది. పోలింగ్ రోజు ఏజెంట్లకు టీ, భోజనం సమకూర్చేవారం. ఓటర్లు స్వచ్ఛందంగా ఓట్లేసి సమస్యలు తీర్చుకోవడంలో.. అభివృద్ధి పనులు చేయించుకోవడంలో అంతే డిమాండ్‌తో ఉండేవారు. అప్పట్లో ఉన్న కేంద్ర ఎన్నికల అధికారి టీఎన్.శేషన్ నింబంధనల వల్ల ఓటర్లల్లో చైతన్యం రావడంతో పాటు ఓటు హక్కు వినియోగంపై ప్రజలు ఆసక్తి చూపారు.

ఎన్టీఆర్ బాధపడిన తీరు మర్చిపోలేను

1994లో ఎన్టీఆర్ ప్రభజనంతో ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. తాను రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సమయంలో దివంగత పి.జనార్దన్‌రెడ్డి సీఎల్‌పీ లీడర్‌గా నేను సీఎల్‌పీ కార్యదర్శిగా ఎన్నికయ్యాం. కొద్ది నెల్లోనే చంద్రబాబునాయుడు వెన్నుపోటుతో సీఎంగా ఉన్న ఎన్టీఆర్‌ను పదవీ నుంచి దించేశాడు. ఆ సమయంలో ఎన్టీఆర్ బాధపడిన తీరు నేటికి మర్చిపోలేకపోతున్నాను. 1989లో మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఏడాదికే ఎన్.జనార్దన్‌రెడ్డి, మరో ఏడాదికే కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సీఎం అయ్యారు. ముగ్గురు సీఎంలకు అతి సన్నిహితంగా ఉండేవాడిని. రెడ్డి కులస్తులు కేబినెట్‌లో ఎక్కువగా ఉండడంతో మంత్రి పదవికి బదులుగా హుడా చైర్మన్ పదవి వచ్చింది. దీంతో మహానగర అభివృద్ధి, డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం కృషి చేశా. ఎమ్మెల్యే హోదాలో ఉన్నప్పటికీ సెల్ఫ్ డ్రైవింగ్‌తో నియోజకవర్గంలో పర్యటించేవాడిని.

పోటీకి విముఖత

ఏఐసీసీ అధిష్టానం, ఇబ్రహీంపట్నం లేదా ముషీరాబాద్ నుంచి పోటీ చేయాలని కోరింది. కానీ ప్రస్తుత రాజకీయాలు తనలాంటి వారికి కష్టం. అందుకే అధిష్టానం ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. వైఎస్సార్ మరణం తర్వాత రాజకీయాలకు విలువ లేకుండా పోయింది. ప్రజలు నిజాయతీగా ఓటు హక్కు వినియోగించుకున్న నాడే ప్రజాస్వామ్యం రక్షించబడుతుంది.

వైఎస్సార్ అకాల మరణం.. రాజకీయ శాపం



2004లో జరిగిన రైతు సదస్సులో వైఎస్సార్‌కు తలపాగా అలంకరిస్తున్న ముదిరెడ్డి

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేను ఎంతో సన్నిహితంగా ఉండే వారం. కాంగ్రెస్‌ను బతికించేందుకు వైఎస్సార్ ఎంతో కష్టపడ్డాడు. ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఆయనతో రాష్ట్రమంతా తిరిగేవాడిని. చిన్న బేదాభిప్రాయంతో రాజకీయంగా వెనుకబడిపోయా. 2009 రెండోసారి సీఎం అయ్యాకా అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చాడు. ఆయన మాటిచ్చిండు అంటే తప్పేవాడు కాదు. అందుకే ప్రజల్లో నేటికి వైఎస్సార్ దేవుడిగా మిగిలాడు. ఆయన అకాల మరణం తనకు రాజకీయ శాపంగా మారింది.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

శంషాబాద్: వచ్చే 12 రోజులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. నోడల్ అధికారులైన డీసీపీ, ఏసీపీలతో శనివారం శంషాబాద్ డీసీపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేయడంతో పాటు ప్రణాళికా బద్ధంగా శాంతిభద్రతలను పర్యవేక్షించాలన్నారు. అక్రమ మద్యం, నగదు పంపిణీల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు రూట్ మొబైలింగ్‌ను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్దకు రవాణా సాఫీగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. శంషాబాద్ డీసీపీ కె. నారాయణరెడ్డి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌రావు, ఎలక్షన్ సెల్ డీసీపీ అశోక్‌కుమార్, అడిషనల్ డీసీపీలు రవికుమార్, రామ్‌కుమార్, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

• యాదన్న చిందు.. ఓటర్లకు కనువిందు



అభిమానులతో కలిసి నృత్యం చేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు వినూత్న రీతిలో ఆకట్టుకుంటున్నారు. శనివారం మండల పరిధిలోని కొమరబండలో బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య మహిళలతో కలిసి చిందేశారు. ఆయన వెంటనున్న నాయకులు సైతం ఉత్సాహంతో కదం కలిపారు. – షాబాద్